5

వరలక్ష్మీ వ్రతం

ఇరుగుపొరుగులను ప్రేమించడం మధ్య ఇంట్లో కాపురం ఉన్నవారి విధ్యుక్తధర్మం. పెద్దలమాటలపట్ల గురి, గౌరవం ఉన్న విశ్వేశ్వరరావు పొరుగింట కొత్తగా దిగిన సూర్యనారాయణగారి సుపుత్రి గాయత్రిని ప్రేమించాడు. ఆమె మేడమీది గది కేటాయించుకుందని తెలియగానే, విశ్వేశ్వరరావు పిన్నికీ, మా బాబాయికీ నచ్చచెప్పి బ్రతిమాలి తనూ తమ మేడమీది గదిలోకి మారాడు.

పొరుగింటి పంచకల్యాణి ఆమర్నాటికే పైనుంచి కాంపు ఎత్తేసి, కింది గదిలోకి మారిపోయింది. చదువు మానేసిన గాయత్రికి ఉజ్జీగా తనూ తన గదులు మార్చడం కోసం తలనొప్పి, జ్వరం, కుడిచేయి కొద్దిగా తెగుట, కాలి బొటనవేలికి దెబ్బతగులుట మొదలైన కారణాలు వర్ణించి, విశ్వం ఆఫీసుకి సెలవు పెట్టడం కూడా జరిగింది. అహర్నిశలూ గాయత్రి జపించినా ఫలితం లేకపోయింది.

గాయత్రి ఇంటికి వస్తుంది. పిన్నితో కబుర్లాడుతుంది. తన భోగట్టా శ్రద్ధగానే వింటున్నట్లు కనబడుతుంది. అయినా తను కిటికీలోంచి చూచినపుడు, తిరస్కారభావం కనబడేది ఆమె మొహంలో. ఒకొక్కసారి తనని చూసి నవ్వుతు

న్నట్లు కనిపించింది. పిన్నిదగ్గర హేళనగా మాట్లాడినట్లు అనిపించింది.

ఒకానొక ముహూర్తాన తన ఊహలు నిజమేనని నిర్ధారణగా తోచింది విశ్వేశ్వరరావుకి. ఉత్తర క్షణాన, "ఈ పిల్ల నెలాగైనా పెళ్ళాడుతాను" అని ఒట్టుపెట్టుకున్నాడు.

అయినా గాయత్రి ప్రసన్నం కాలేదు.

*　　　*　　　*

శ్రీరామ పఠనమందిరంలో కూర్చుని పత్రికవంక దీక్షగా చూస్తున్న విశ్వేశ్వరరావు ప్రక్కనే ఒక జోగినాథం చేరాడు. అతను కూడా పత్రికలోకి తొంగితొంగిచూసి చదువుతున్నాడు. ఆ పేజీ అయిపోయింది. ప్రక్క పేజీ చూడాలి. ఎంతసేపటికీ విశ్వం పేజీ తిప్పడామె. జోగినాథం చొరవచేసి పేజీ తిప్పాడు. విశ్వం విసుక్కోలేదు; 'మేనర్సు లేవా' అని కసరలేదు.

జోగినాథానికి కుతూహలం కలిగింది. పేపరు లాక్కుంటున్నా కసిరికొట్టకపోవడానికి కారణం ఏమిటా అనిపించింది. అంత విరక్తి దేనికా అనిపించింది.

"ఏమిటోయ్ విసినాథం? అలా ఉన్నావూ?" అన్నాడు.

అసలు సిసలు సినిమా హీరోలా అతిమెల్లిగా తల ఎత్తి కుడివైపుకి తిప్పి బాధగా చూశాడు విశ్వం.

"ఆర్చేవాడివా తీర్చేవాడివా?" అన్నాడు విసుగ్గా.

"అరుస్తాను, తీరుస్తాను. నీ కొచ్చిన కష్టం చెప్పవోయ్" అన్నాడు జోగినాథం.

"అయితే చెబుతా పట్టు. ఏ మాత్రం సాయం చేస్తావో."

"పూజా పునస్కారాలు లేక బూజుపట్టి ఉన్నాను గాని, నైవేద్యం పెట్టు మరి, నా మహిమ చూపిస్తాను" అన్నాడు జోగినాథం హుషారుగా.

ఉదయం తొమ్మిది వేశారు. విశ్వం ఒక్క క్షణం ఆలోచించి, జ్వరం వచ్చిందని సెలవుచీటి రాసి, ఆఫీసుకు పంపేశాడు. తరవాత జోగినాథాన్ని వెంటబెట్టుకొని, నైవేద్యం పెట్టడానికి బయల్దేరాడు.

* * *

ఫలహారాల అనంతరం, ఆత్మకథను నివేదించాడు విశ్వం.

"పంతులూ – 'గాయత్రీ' జపం ఏం పనిచెయ్యేదు. నువ్వు రేపట్నించే సూర్యనమస్కారాలు ప్రారంభించాలి" అని తూచి తూచి సలహా చెప్పాడు జోగినాథం.

విశ్వం చప్పగా నవ్వాడు.

"అయినా కాకపోయినా, సూర్యనారాయణగారు నిన్ననే చెన్నపట్టణం వెళ్లారు. పదిహేను రోజులవరకూ రారట."

జోగినాథం ఊహాలకి బ్రేకుపడింది. ఇంకో సిగరెట్టు ముట్టించాడు. "మీ గాయత్రి అమ్మగారి పేరిమిటో తెలుసా?"

"వరలక్ష్మమ్మగారు"

"రైటో. శ్రావణమాసం సగం గడిచిపోయింది. పోతే పోయిందిలే కాని నువ్వు రేపటినించీ వరలక్ష్మీవ్రతం చెయ్యి. మీ మావగారు రాగానే సూర్యనమస్కారాలు ప్రారంభించుచు, ఆపైన నేచెప్పినరోజున ఉద్యాపన చేసుకుందువుగాని" అన్నాడు జోగినాథం ధీమాగా.

'సరే' అన్నాడు విశ్వం నీరసంగా.

"మరేం భయంలేదు. భక్తిప్రపత్తులతో వ్రతం ఆరంభించి, ఆవిడ వాత్సల్యాన్ని సంపాదించు. ప్రసన్నురాలుగా చేసుకో" అని జోగినాథం విశ్వానికి వరలక్ష్మీవ్రత విధానం ఉపదేశించి, ఇంకో సిగరెట్టు పుచ్చుకున్నాడు.

"పెద్దలను ఖాతరు చేయకుండా ముఖాముఖిని ప్రేమించి పెళ్ళాడబోయిన ఆసాములు అట్టేమంది నెగ్గుకొచ్చినట్టు గాథలలో కనబడదు. ధక్కా మొక్కీలు బోలెడు తిన్నవాణ్ణి నేనూ ఎరగను. అందుకని 'అన్యథాశరణం నాస్తి' అని నమ్మి మరీ వ్రతం చెయ్యి" అని హెచ్చరించి, మిగతా సిగరెట్లు తీసుకున్నాడు జోగినాథం.

* * *

విశ్వేశ్వరరావు గురూపదేశానుసారం, మర్నాడు సూర్యోదయాత్పూర్వమే నిద్రలేచాడు. ప్రకృతి తెల్లగా, చల్లగా, చక్కగా కనబడింది. "ఓహో! పొద్దున్నే లేస్తే ప్రకృతిసౌందర్యం ఆస్వాదించవచ్చు కాబోలు" అనుకున్నాడు. వీధిలోకి వెళ్ళిచూచాడు. 'గాయత్రి' గుమ్మం

కడిగి పసుపు కుంకం పెడుతూంది. గాయత్రి, అభినేత్రి, సావిత్రి, రచయిత్రి, కవయిత్రి అని గబగబా అనుకున్నాడు. కాఫీ త్రాగి సైకిలెక్కి, గోదావరి ఒడ్డున ఉన్న ఆంజనేయ స్వామి కోవెలకు వెళ్ళాడు. పూజారిగారి కో నమస్కారం పెట్టి, కోవెల ఆవరణలో పూలు కోసుకున్నాడు. చకచక ఇంటికి చక్కావచ్చి, పిన్నికి నాలుగు పువ్వులిచ్చి పెరట్లోకి వెళ్ళాడు. వరలక్ష్మమ్మగారు పెరట్లోఉన్న మందార, నంది వర్ధనం కోసుకొంటోంది. 'పువ్వులు కావాలా అండీ' అనే శాడు సాహసించి.

వరలక్ష్మమ్మగారు మురిసిపోయింది. పువ్వు లందు కుంటూ 'శీఘ్రమేవ కళ్యాణప్రాప్తిరస్తు' అని ఆశీర్వదించింది చనువుగా.

విశ్వం సిగ్గుపడిపోయాడు.

"ఏరా, విశ్వం? ఏంకథ? కొంపతీసి సంధ్యావందనం కూడా చేస్తావేమిటి?" అన్నాడు వాళ్ళ బాబాయ్. బాబాయి పక్కన నవ్వాడు.

"అక్కడికి రోజూ సంధ్య వార్చినట్లు" అన్నాడు విశ్వం సాధ్యమైనంత గట్టిగా, బాబాయిని సావిట్లోకి వెళ్ళ నిచ్చి పిన్నిని బ్రతిమాలుకున్నాడు విశ్వం. సంధ్యావందనం సంగతి దండోరా వేయించవద్దని.

"ఒరేయి, సంధ్యవారుస్తున్నట్లు తెలిస్తే కాలేజీ పిల్ల లెవరూ ఎదురుకట్నం ఇచ్చినా పెళ్ళాడరుసుమా" అందావిడ నవ్వుతూ.

"మరేం ఫరవాలేదు. ఇంటర్ ఫెయిలయినవాళ్లు చాలు. అసలయినా ఇపుడు పెళ్లి గొడవెందుకు?" అన్నాడు విశ్వం.

"మరేనాయినా. ఏడుమల్లెపూలఎత్తు రాజకుమారిని ఎంతచక్కనిదాన్ని వరిస్తావో చూస్తాంగా" అంది పిన్ని.

*　　　*　　　*

భారతం, భాగవతం, రామాయణం, స్త్రీల వ్రత కథలూ మొదలైన మంచి పుస్తకాలన్నీ ఎక్కడెక్కడి సించో పట్టుకొచ్చి వరలక్ష్మమ్మగారికి ఇచ్చేవాడు విశ్వనాథం. రోజూ తెల్లవారేసరికి పూలసజ్జనిండా పువ్వులు కోసుకువచ్చి అందించేవాడు.

శుక్రవారంనాడు విశ్వేశ్వరరావుకి అధికారరీత్యా కాలికి పెద్దదెబ్బ తగిలినందువల్ల ఆఫీసుకి సెలవు పెట్టవలసి వచ్చింది.

ఆనాడు వ్రతం అయినందువల్ల అతను తొలికోడితో మేలుకుని, కాకితో పడున్నాడు.

"ఆయన ఊళ్ళో లేనందుకు, ఈ అబ్బాయి లేకపోతే వ్రతం, పేరంటం ఎంత అభాసయిపోను" అని వరలక్ష్మమ్మగారు ఊహలు, ఇదైపోయి, పదేపదే ఆ ముక్క అంటూ వచ్చింది. విశ్వం మురిసిపోయి, పరుగున జోగినాథం దగ్గరకు వెళ్లి చెప్పాడు.

"భేష్, కథ దారిన పడింది. కానీ" అని వీపు తట్టాడు జోగినాథం.

*　　　*　　　*

గాయత్రి హిందీ చదువుతోందిట.

"బుధవారం పరీక్షట బాబూ. కాస్త శ్రమనుకోక, ఇవాళా రేపూ దానికి రెండు ముక్కలు చెబుదూ. నాయన్నాయన" అని ప్రాధేయపడింది వరలక్ష్మమ్మగారు.

"ఎంతమాట. తప్పకుండా," అన్నాడు విశ్వం.

"నీకొచ్చిన ఇంతోటి పాండిత్యానికీ ట్యూషనే చెప్పగలవురా! పైగా' ఆఫీసులేదూ?" అంది పిన్ని.

"మరేం ఫరవాలేదు. రేపూ ఎల్లుండీ అంపకంపాలతో ఉష్ణం ఒచ్చేస్తుందిలే." అన్నాడు విశ్వం.

మర్నాడు పదిన్నరకి ఆఫీసునుంచి కబురొచ్చింది అర్జెంటుగా రమ్మని. అప్పటికి, 'గాయత్రికి పాఠం చెబుతున్న హడావుడిలో' జ్వరంసంగతి మర్చిపోయి విశ్వం ఆఫీసుకి వెళ్ళాడు.

"ఏదీ జ్వరం?" అన్నారు ఇంజనీరుగారు పక్కన నవ్వి. తనంటే ఆయనకీ అభిమానమనీ విశ్వానికి తెలుసు.

"జ్వరం కదండి వచ్చే వేళయిందండి. నిన్న ఆదివారం పదకొండింటికి వచ్చిందండి. మళ్ళీ ఇవాళా..." అని నసిగాడు.

"అబ్బాయ్, ఇదేం కుదరదు. ఇకనుంచి నీకు రెణ్ణెల్లకోసారితప్ప జ్వరం రాకూడదు. ఐదార్నెల్లకొకసారే కాలు విరగొట్టుకోవాలి...నెలకోసారి చెయ్యి తెగ్గొట్టుకోవచ్చు. తలనొప్పి ఎంత జోరుగా వచ్చినా పొద్దుట పదకొండులోగా

పోయి తీరాలి. పెద్ద పెద్ద ఖాయిలాలు అసలు వల్లకాదు. ఏడాదికి ఓసారి వచ్చినా పదిహేను రోజుల్లో పోవాలి'' అన్నాడాయన, తలవంచుకొని ఏదో రాసుకుంటూ.

"అలాగేనండి. ఇవాళా రేవుమాత్రికి జ్వరం రానివ్వండి'' అన్నాడు విశ్వం సెలవుతీసుకుంటూ.

* * *

శ్రావణమాసం. దానితోపాటు విశ్వం వరలక్ష్మీవ్రతం పూర్తికావచ్చాయి. పొరుగింటివారింట చారు ఘుమఘుమలాడినట్లు, పిన్ని కాచినచారు ఘుమఘుమలాడదని విశ్వం అనేకసార్లు ఢంకామీద దెబ్బకొట్టినట్టు చెప్పాడు. ఓసారి కాస్త జ్వరం వచ్చినపుడు, వాళ్ళింటో చారుకావాలని పోరి తెప్పించుకుని, సేవించి, మర్నాడు అనర్గళంగా ఆ చారు రుచులను పొగిడాడు.

చెన్నపట్టణంనుంచి సూర్యనారాయణగారు వచ్చిన మర్నాటి ఉదయమే విశ్వేశ్వరావు సూర్యనమస్కారాలు కూడా ప్రారంభించాడు.

వీధరుగుమీద కూర్చుని దంతధావనం చేస్తున్న ఆ సూర్యనారాయణగారు, హఠాత్తుగా ఈ నమస్కారంచూసి హడలిపోయి లోపలికి పరుగెత్తాడు.

"ఔనే, ఇలా రా. వాళ్ళబ్బాయి నాకు దండంబెట్టాడెందుకు?'' అని అడిగేశాడు, ఖచ్చితంగా.

"హయ్యో రాత! రాయిచ్చుకు కొట్టినట్లు చెప్పాచ్చారే. ఆపిల్లాడిసంగతి మీకేం తెలుసు? ఎంతబద్దీగా...ఎంత

వినయం...ఏంవందనం. అలాటి పిల్లాడు గర్భవాసాన పుట్టడానికి ఆతల్లి ఏం నోచిందో'' అంటూ ఆవిడ అదేఇదిగా చెప్పుకు పోయింది.

*　　　*　　　*

జోగినాథం చాలా మెచ్చుకున్నాడు విశ్వం అదృష్టానికి. ''పంతులూ, కథ ముగిసినట్టే. ఇంకేం లేదు. చిన్న ఉద్యాపన ఉంది. అది కాస్తా చేస్తిమా, నీ నోము పండిందే. అయితే ఒక్క సంగతి...''

''ఫరవాలేదు. ఎంతో చెప్పు'' అన్నాడు విశ్వం హుషారుగా.

''దానాదీనా తడిసి మోపెడవుతుంది కాని, పాతికలో సర్దేస్తాను.''

''రైటో. ఉద్యాపన ఏమిటో చెప్పు.'' జోగినాథం చెప్పాడు.

విశ్వం, 'ఏడిసినట్టుం దన్నాడు.'

జోగినాథం ''నీ మొహం, నీకు తెలీదు'' అన్నాడు.

విశ్వం 'రైటో' అన్నాడు.

ఉద్యాపనకి శ్రావణమాసం ఆఖరి శుక్రవారం సాయంత్రం ముహూర్తం పెట్టారు. లక్ష్మీవారం సాయంకాలం విశ్వం పెరట్లో పిట్టగోడకి చేరబడినుంచుని, పిన్నితో 'నేటి సమాజంలో సంస్కరణలు' అను విషయంపై విజ్ఞాన చర్చ జరిపాడు. వరలక్ష్మమ్మగారు తులసిమొక్కకి పూజ

చేయడానికి రావడంచూసి, వరకట్నాలు ఎంతదారుణమో, కావాలనేవారు ఎంత రాక్షసులో ధాటీగా ఉపన్యసించాడు.

'ఔరా! ఏమిగొప్ప హృదయం' అని ముక్కుమీద వేలేసుకు మరీ ఆశ్చర్యపడింది వరలక్ష్మమ్మగారు. గాయత్రి ముసిముసి నవ్వులు నవ్వుతోన్నదల్లా పక్కన నవ్వి ఇంట్లోకి వెళ్ళిపోయింది.

"ఇంకా హేళనేనా" అనుకుని కంఠశోషకు ఉసూరుమంటూ, మేడమీదికి వెళ్ళిపోయాడు విశ్వం. మర్నాడు సాయంత్రం మసకసంధ్యవేళ, పిన్ని వరలక్ష్మమ్మగారింటికి వెళ్ళి, తాంబూలం పుచ్చుకువచ్చింది.

వేసుకున్న పథకం అమలుజరగడానికి ఐదునిముషాలు కూడా వ్యవధిలేనందువల్ల విశ్వం పెరట్లోనే విహరిస్తున్నాడు.

"ఒరేయ్ విస్సీ, ఇలా రా" అంది పిన్ని వంటింట్లో పీటవేసి.

విశ్వం వెళ్ళాడు.

"నామీద నీకు గౌరవముంటే చెప్పినట్లు విని, వాళ్ళ గాయత్రిని చేసుకో" అంది.

విశ్వం నోరుతెరచి అట్టే కొయ్యబారిపోయాడు.

"వినకపోతే నీకర్మం. లక్షణమైన పిల్ల, బుద్ధిమంతురాలు. నేవళీకం ఉంది. ఆయనా, ఆవిడాకూడా నిన్నుచూచి ఎంతో ముచ్చటపడుతున్నారు. 'అతనికి గినా కట్నం పుచ్చుకోగూడదని పట్టింపుఉంటే, అదేదో మరోవిధాన

ముట్టచెబుతాం' అని బ్రతిమాలారు. ఇష్టమైతే చెప్పు. ఆయన రాత్రి రైలుకి వెళ్ళిపోతున్నారు. నువ్వు 'ఊ' అంటే మళ్ళీ రాగానే పెళ్ళన్నారు. అన్నట్టు, అసలుసంగతి మర్చిపోయాను. అలాఉంది గాని, ఆ పిల్లకి నువ్వంటే పంచ ప్రాణాలూనూ. ఇందాకా నా ఎదుటే, సిగ్గువిడిచి చెప్పింది కూడా. అలాటి లక్ష్మి నీకు వెయ్యి జన్మలెత్తినా దొరకదు. ఊ అనరా బాబూ'' అందావిడ.

కొయ్యబారిన విశ్వేశ్వరరావు అతికష్టంమీద 'ఊ' అన్నాడు.

పిన్ని సంతోషంతో లేచి, పొరుగింటికి వెళ్ళబోయింది. ఎవరో వీధితలుపు తట్టారు. 'వచ్చే వచ్చే!' అంటూ విశ్వం వంక చూచి ఆవిడే వెళ్ళింది తలుపుతీయడానికి.

అంతలోనే పెరట్లో చప్పుడైంది. "కొంపమునిగింది. అయినా ఇంత లేటుగా చెబితే ఎలా? జోగినాథం ఉద్యాపనకొచ్చాడుకాబోలు'' అన్నాడు విశ్వం గట్టిగానే, అంటూనే లేచి పెరట్లోకెళ్ళాడు.

"అయ్యో! అయ్యో! దొంగ దొంగ'' అంటూ వరలక్ష్మమ్మగారు, ఆమెభర్తా, గాయత్రీ పెరట్లోకొచ్చారు. విశ్వం చెంగున గోడదూకి అటు వెళ్ళాడు.

పారిపోతున్న ఆ దొంగ పెరటిగుమ్మం దగ్గిర రాయి తగిలి బోర్లగిలా పడ్డాడు.

'త్వరగా లేచిపో' అన్నాడు విశ్వం దొంగదగ్గరకెళ్ళి. ఇంతలోనే వరలక్ష్మమ్మగారు, ఆమె భర్త వచ్చేయడంతో

గుట్టు బయటపడుతుందని విశ్వం తెగించాడు. లేచి పారిపోబోతున్న జోగినాథం రెక్కపట్టుకొని లేపాడు.

"దొంగ వెధవా! ఎక్కడికి పోతావ్" అని గద్దించాడు చేతనయినంత కోపంగా.

"కనిష్టీపుల్ని పిలుస్తా ఉండు" అన్నాడు సూర్యనారాయణగారు.

విశ్వానికి పైప్రాణం పైనించి లేచిపోయింది. "అబ్బబ్బే! వద్దండి, మనవాడే...ఐమీన్ ... మనమే చిదగ్గొట్టి పంపేద్దాం. శుక్రివారం పూటా ఒక మానవుణ్ణి జైలుకు పంపటం ఎందుకు" అన్నాడు.

"ఆ వెధ వేంచేశాడో నీకు తెలుసా బాబూ? మా లక్ష్మికి నేను వేసిన నెక్లెసు తీస్తున్నాడు. అంతలో నేను వచ్చి అట్టే అన్నాను. ఒక్కక్షణం ఆలస్యమయితే... ఇంకేమన్నా ఉందా."

"అంతేలెండి పిన్నిగారూ - ఐమీన్ అత్తయ్యా. అయినా వదిలేద్దాం పోలీసులగోల మనకెందుకు. మనమే... నేనే తన్నేస్తా" అన్నాడు విశ్వం గంభీరంగా.

"వెధవని డొక్క వాలికజేసి మరీ వదులు బాబూ." అన్నారు సూర్యనారాయణగారు గోచీ బిగించుకుంటూ.

వ్రతం చెడ్డా ఫలందక్కాలి. ఇప్పుడు వ్రతం ముగిసేలోగానే ఫలం దక్కింది. జోగినాథం దొంగతనం చేయబోవడం, తను అడ్డుపడి, ఆ 'దొంగ'ని తరిమివేసి అత్తగారి

మెప్పులందుకోవడం ఈ వ్రతానికి ఉద్యాపన. ఇప్పుడు గనక ఈ ఉద్యాపన చెడితే గుట్టు రట్టులవుతుంది. కథ బెడిసి కొడుతుంది. ఫలం నిష్ఫలం అవుతుంది.

"జోగినాథం! నన్ను క్షమించు" అని మనసారా అనుకుని, చుట్టూ ఉన్నవారికి అనుమానం కలగకుండా ఉండగలందులకు గాను, అంతకన్న మనసారా జోగినాథం జుట్టు పట్టుకొని వీపు బద్దలయేలా బాదాడు విశ్వం. దెబ్బ దెబ్బకీ ఐదూ, పదీ, పదిహేనూ చొప్పున పరిహారం ఇచ్చు కుంటానని సాంకేతిక భాషలో చెబుతూనే వాస్తవికత ఉట్టిపడేటట్లు అభినయించడానికై జోగినాథం చెంపలుకూడా వాయగొట్టాడు.